కూటమి నేతల బరితెగింపు

కూటమి నేతలు దక్కిలి పంచాయతీలో పంచాయతీరాజ్ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారు. తమ మాట వినడం లేదని గిరిజన మహిళా సర్పంచ్‌ను బెదిరించారు. అప్పటికీ ఆమె వినకపోవడంతో అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి చెక్ పవర్‌ను రద్దు చేయించారు. పరిపాలనలో ఆమెకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. సొంత అజెండా రూపొందించుకుని పంచాయతీ కార్యదర్శి ద్వారా పనులు చేసుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణకు వచ్చిన అధికారి సైతం సర్పంచ్‌పై బెదిరింపులకు పాల్పడడం గమనార్హం.

- మాట వినడం లేదని గిరిజన మహిలా సర్పంచ్‌కు బెదిరింపులు
- చెక్ పవర్ రద్దు చేయించిన వైనం
- పనులు చేసినా చేయలేదని ఆరోపణలు
- కూటమి నేతల చర్యలతో విస్తుపోతున్న స్థానికులు


దక్కిలి సచివాలయంలో సమావేశం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


దక్కిలి చెరువు కట్ట అభివృద్ధి పనులు జరుగుతున్న దృశ్యం (ఫైల్)


దక్కిలిలో కరోనా సమయంలో వీధుల్లో మందు స్ప్రే చేస్తున్న పంచాయతీ సిబ్బంది (ఫైల్)

సాక్షి, టాస్క్‌ఫోర్స్: దక్కిలి పంచాయతీలో నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ మద్దతుదారు అయిన గిరిజన మహిళ శనగా వేమక్క గెలుపొందింది. ఆమె పంచాయతీ నుంచి వచ్చే ఆదాయంతోపాటు ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చుకుని సీసీ రోడ్లతోపాటు మురుగు కాలువలు, చెరువు కట్ట అభివృద్ధి పనులు చేశారు. ఎక్కడా మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. అన్ని ప్రాంతాల్లోనూ వీధి లైట్లు ఏర్పాటుచేశారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించారు. ఆమెకు వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేని టీడీపీ నేతలు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కక్ష సాధింపు చర్యలకు దిగారు. పలు ఆరోపణలు చేసి చెక్ పవర్‌ను రద్దు చేయించారు. అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి అభివృద్ధి పనులతోపాటు సమావేశాల్లో సైతం సర్పంచ్‌కు ఉండే హక్కులను, ప్రొటోకాల్‌ను హరించారు. ఆమెకు సంబంధం లేకుండానే అజెండా తయారు చేసి పనులు చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 17న ఆమె తనకు సంబంధం లేకుండానే పంచాయతీలో పనులు చేస్తున్నారని, సమావేశాలు నిర్వహణలోనూ తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని పంచాయతీ కార్యదర్శితో పాటు కొంతమంది అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణ ఏకపక్షంగా కూటమి నాయకుల సమక్షంలో విచారణ చేపట్టారు. విచారణను తప్పుదోవ పట్టించేందుకు ఒక దశలో సర్పంచ్‌ను బెదిరించారు.

సచివాలయంలో టీడీపీ నాయకుల సమావేశం

టీడీపీ నాయకులు సచివాలయాన్ని తమ పార్టీ కార్యాలయంగా మార్చుకున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 25వ తేదీన విలేకరుల సమావేశం నిర్వహించారు. దీని వెనుక దక్కిలి పంచాయతీ కార్యదర్శి పాత్ర ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో అన్ని కార్యాలయాల్లోనూ కూటమి నాయకులు తిష్ట వేస్తారని పేర్కొంటున్నారు.

> **అభివృద్ధి చేసినా వేధింపులు తప్పట్లేదు**
>
> 
>
> నేను నాలుగేళ్లగా అనేక అభివృద్ధి పనులు చేశాను. కరోనా కాలంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాం. అన్ని చేసినా నాకు చెక్ పవర్ లేకుండా చేశారు. గిరిజన మహిళ అన్న ఉద్దేశంతోనే వివక్ష చూపుతున్నారు. చేసిన పనులకు సంబంధించిన లెక్కలు సక్రమంగా లేవని అధికారులు బెదిరిస్తున్నారు. ఇదంతా కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే సాగుతోంది.
>
> – శనగా వేమక్క, సర్పంచ్
>
> **ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి**
>
> 
>
> దక్కిలి పంచాయతీలోనాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. గతంలో పంచాయతీ సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించిన తర్వాతే పనులు చేపట్టే వాళ్లం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్పంచ్, వార్డు మెంబర్లకు సంబంధం లేకుండానే అజెండాలు తయారు చేసుకుంటున్నారు. సమావేశాలు నిర్వహించినట్లు చూపుతున్నారు. కూటమి నేతలకు అధికారులు వత్తాసు పలుకుతున్నారు.
>
> – మాదిరెడ్డి మునిరెడ్డి, వార్డు మెంబరు

నేడు మండల సమావేశం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కోటేశ్వరరావు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెళ్లకూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో దయానంద్ తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై తనిఖీలు చేసినట్టు తెలిపారు. ఆయా బృందాల నివేదికను ప్రజావేదికలో వివరిస్తారని తెలిపారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

పెళ్లకూరు: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను శుక్రవారం తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుజాత ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ తెలుగు నెలలను అనుసరించేందుకు వీలుగా తెలుగు తిథులు, ఆంగ్ల తేదీలతో క్యాలెండర్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హిందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు చింత సుబ్రమణ్యం, సభ్యులు శ్రీనివాసులు, చామంతి, సుమలత పాల్గొన్నారు.

పేదలకు తోడ్పాటు

నాయుడుపేట టౌన్: పేదలకు తోడ్పాటు అందిస్తామని యూ ఆర్ టూ గెదర్ సంస్థ యువకులు తెలిపారు. వారు శుక్రవారం నాయుడు కల్యాణ మండపం సమీపంలో ఉంటున్న వృద్ధులు క్షత్రియ రాజమ్మ, బాలాజీ దంపతులకు బియ్యం బస్తా, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశారు. సంస్థ ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి, పి.సుబ్బు, యాసిన్, అయ్యప్ప, సాయి నవీన్, శివ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.60 వేల విరాళం



సూళ్లూరుపేట : పట్టణంలో వెలసిన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి దొరవారి సత్రం మండలం శ్రీధనమల్లికి చెందిన పెల్లేటి బాబురెడ్డి శుక్రవారం రూ.60 వేలు విరాళం ఇచ్చారు. మొత్తాన్ని ఆలయ ఈవో బి.ప్రసన్నలక్ష్మికి అందజేశారు. బాబురెడ్డి కుమారుడు కెనడాలో ఉద్యోగంలో చేరాడు. మొదటి నెల జీతం మొత్తాన్ని నిత్యాన్నదాన పథకానికి అందజేసి మొక్కులు చెల్లించుకున్నాడు.

భక్తులకు ప్రసాదాల పంపిణీ


ప్రసాదాలు పంపిణీ చేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

చిల్లకూరు : జాతర సందర్భంగా ముత్యాలమ్మ ఆలయంలో గురు, శుక్రవారం రెండు రోజులు నిరంతరాయంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారిని దర్శించుకుని వచ్చే ప్రతి భక్తునికీ పులిహోర, బెల్లం పొంగలి, దద్దోజనాన్ని తూర్పుకనుపూరు పంచాయతీలోని ఈదులవారిపాళెం సమీపంలో నవయుగ సంస్థ ఎండీ హర్షవర్ధన్‌రెడ్డి, నవనీత పబ్లిక్ స్కూల్ సహకారంతో రెండు లక్షల మందికి ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే చింతవరం గ్రామంలోని రేస్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం సుబ్బయ్య, బాలచెన్నయ్య తమ సిబ్బందితో కలిసి వాటర్, రస్నా ప్యాకెట్లు అందజేశారు. అలాగే పలుచోట్ల మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్

కోట : స్క్రీనింగ్ పరీక్షలు చేసుకుని తగిన మందులు వాడితే క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని చిట్టేడు పీహెచ్‌సీ వైద్యులు నాగరాజు తెలిపారు. మండలంలోని కేసవరం, చెందోడు గ్రామాల్లో శుక్రవారం స్విమ్స్ వైద్యులు చైతన్య భాను, హరిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కిరణ్, అల్లాబక్షు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా కిట్లు పంపిణీ



గూడూరు రూరల్ : గూడూరులోని దర్గావీధిలో ఉన్న ఈద్గా యూత్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం 300 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మగ్దూమ్, ఈద్గా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్, కార్యదర్శి యస్థాని, షఫీ మౌలానా, నూర్ స్వచ్ఛంద సేవా సంస్థ అబ్రారుల్ హక్, ఇనాముల్ హక్, సభ్యులు మున్నా, ఖాదర్ పాల్గొన్నారు.

నిధులు కావాలా నాయనా..

చిల్లకూరు : గ్రామాల్లో పార్టీ ఎగురవేసిన వారికే ఉపాధి హామీ నిధులు మంజూరుచేస్తామని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సోషల్ మీడియా ద్వారా శుక్రవారం సమాచారం అందింది. దీంతో నాయకులు, కార్యకర్తలు బిత్తరపోయారు. టీడీపీ ఆవిర్భావం సందర్భంగా శనివారం ఉదయం ఆయా గ్రామాలు, వార్డుల్లో ఉన్న జెండా దిమ్మెల వద్ద పార్టీ జెండా ఎగురవేయాలని, అలా చేయని వారికి ఉపాధి హామీ ద్వారా వచ్చే నిధులు నిలిపివేస్తామని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. దీన్ని చూసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇదేమిటని లోలోన మథన పడుతున్నారు. నేడు అధికార పార్టీ విధానాలు నచ్చని వారు కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. ఇలా బలవంతంగా జెండాను ఎగురవేయాలని ఆదేశించడం వెనుక ఆంతర్యం ఏమిటో అని గుసగుసలు పోతున్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

కోట: ఈ నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్న కోట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.విజయభాస్కర్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కోట, వాకాడు ఎంఈవోలు మస్తానయ్య, నజీంఅలి, హెచ్‌ఎంలు సురేంద్రబాబు, నెల్లూరు సుబ్రమణ్యం, నాగయ్య, గిరి పాల్గొన్నారు.

మత్స్యకారులకు జీవిత బీమా

చిల్లకూరు : మత్స్యకార సొసైటీల్లోని సభ్యులకు జీవిత బీమా సౌకర్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తోందని చిల్లకూరు మత్స్యశాఖాధికారి గోను రఘుబాబు తెలిపారు. ఆయన శుక్రవారం తిమ్మనగారి పాళెం గ్రామంలో కడివేడు చెరువు మత్స్యకార సొసైటీ సభ్యులకు జీవిత బీమాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బీమా చేసుకున్న వారికి కార్డులు అందజేస్తామన్నారు. వారికి ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబానికి పరిహారం అందుతుందన్నారు. చిట్టమూరు, మోమిడి మత్స్యకార సహాయకులు విజయ, వెంకటరమణ, సాగరమిత్ర మోసా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత


నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి, అరాచక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై ఏడాదికే ప్రజా వ్యతిరేకత పెరిగిందని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శుక్రవారం వాకాడులోని తన నివాసంలో వాకాడు, కోట మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, త్వరలోనే మంచి రోజులు వస్తున్నాయన్నారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఉప ఎన్నికల్లో కూటమి నాయకులు ఎన్ని అరాచకాలు, దౌర్జన్యాలు చేసినా వైఎస్సార్ సీపీ తన హవాను చాటుకుందన్నారు. కూటమి నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ముస్లింలు, క్రిస్టియన్లు రామ్‌కుమార్‌రెడ్డితో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శేషురెడ్డి, భక్తవత్సలరెడ్డి, సుధాకర్ నాయుడు, రాజశేఖర్‌రెడ్డి, మధురెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూములకు పట్టాలు ఇవ్వాలని ఆందోళన

సైదాపురం: దళితులు ఆక్రమించుకున్న భూముల్లో ఏర్పాటుచేసిన నిషేధ బోర్డులను తొలగించి పట్టాలు ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం దళితులు, అఖిల భారత రైతు కూలీ సంఘం కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఊటుకూరు గ్రామ సర్వే నంబర్ 3, 20, 25–1, తురిమెర్లలో 460, 461లో 178 ఎకరాల్లో మైనింగ్ కోసం వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీకి ఇచ్చిన లీజు గడువు ముగిసిందన్నారు. ఈ క్రమంలో ఆ భూములను దళితులు, పేదలు ఆక్రమించుకున్నారని తెలిపారు. వాటిలో ఉన్న చెట్లు, పుట్టలు, రాళ్లరప్పలను తొలగించి పంటల సాగుకు అనుకూలంగా తీర్చిదిద్దుకున్నారని వివరించారు. వాటికి పట్టాలు ఇచ్చి పేదలకు న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా ఆ భూముల్లో పెట్టిన నిషేధ బోర్డులను తొలగించాలని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, వెంకటయ్య, మమత, కోటయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కత్తితో నరికి అన్న హత్య

నాయుడుపేట టౌన్ : మండలంలోని కాపులూరు దరఖాస్తు కండ్రిగలో శుక్రవారం రాత్రి అన్నను తమ్ముడు కత్తితో నరికి హత్య చేశాడు. పోలీసుల కథనం మేరకు.. కాపులూరు దరఖాస్తు కండ్రిగకు చెందిన తుపాకుల వెంకటరమణయ్య(50) తల్లితో ప్రతిరోజూ గొడవ పడుతున్నాడు. ఈ విషయమై తమ్ముడు బాబు వారించినా వినలేదు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మరోసారి తల్లితో గొడవ పడిన వెంకటరమణయ్యను బాబు అడ్డుకున్నాడు. అయినా అతను వినకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి ఇంట్లో ఉన్న కత్తితో నరికాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి గ్రామానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన మ్యూజికల్ ఫెస్ట్


ఆటపాటలతో విద్యార్థినుల సందడి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శుక్రవారం రాత్రి మ్యూజికల్ ఫెస్ట్ 2025 అలరించింది. ఇందులో ప్రముఖ సినీ గాయని మంగ్లీ తన బృందంతో సినీ గీతాలు ఆలపించి కుర్రకారును ఉర్రూతలూగించారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు మానసిక ఉల్లాసం అందించేందుకు సంగీత విభావరి నిర్వహించామన్నారు. ఇకపై ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నేదురుమల్లి విక్రమ్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


పాల్గొన్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్


ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో మ్యూజికల్ ఫెస్ట్‌లో సినీ గీతాలు ఆలపిస్తున్న గాయని మంగ్లీ

బీసీ కులగణన చేపట్టాలి

గూడూరు రూరల్ : దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం బీసీ నాయకులతో కలిసి గూడూ రు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయ సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న బీసీ కులాల జనా భా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలని కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని పేర్కొ న్నారు. ఏప్రిల్ 25న తిరుపతిలోని ఇందిరాగాంధీ మైదానంలో జరిగే భారీ బహిరంగ సభకు అన్ని బీసీ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తల్లం ప్రసాద్, జిల్లా కార్యదర్శి వడ్ల జగదీష్, జిల్లా ఉపాధ్యక్షుడు మధు ఆచారి, జిల్లా గౌడ సంఘం నాయకులు రమణయ్య గౌడ్, బీఎస్పీ నాయకులు నాశిన భాస్కర్ గౌడ్, షరీఫ్, అల్లి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భారీగా పెరిగిన ముత్యాలమ్మ ఆలయ ఆదాయం

చిల్లకూరు: తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయ అనుబంధ పోలేరమ్మ జాతర సందర్భంగా ఆలయానికి రూ.63,86,838 ఆదాయం వచ్చినట్టు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. నాలుగు రోజులు భక్తులు హుండీల్లో వేసిన కానుకల ద్వారా రూ.30,81,538, టికెట్ల ద్వారా రూ.16,85,300 ఆదాయం వచ్చిందన్నారు. మొక్కుబడులు కింద దున్నపోతులు ఇవ్వగా వాటిని వేలం వేశామని, రూ.16,20,000 వచ్చిందని తెలిపారు. గత ఏడాదికన్నా భారీగా ఆదాయం పెరిగిందని వివరించారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

వెలుగు సీసీలకు షోకాజ్ నోటీసులు

కలువాయి(సైదాపురం): కలువాయి మండల మహిళా సమాఖ్యలో పనిచేస్తున్న కలువాయి క్లస్టర్ సీసీ ఆర్.విజయమ్మ, దాచురు క్లస్టర్ సీసీ మస్తాన్‌వలికి శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారు రాపూరు మండలంలో పనిచేస్తున్న సమయంలో భారీ అవినీతికి పాల్పడినట్టు తేలింది. జిల్లాలో ఏడుగురు వెలుగు సిబ్బందికి నోటీసులు జారీ చేయగా అందులో కలువాయి, దాచురు సీసీలు ఉన్నారు.

జనార్దన్‌రెడ్డికి పరామర్శ


చంద్రశేఖర్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నేదరుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

చిట్టమూరు : మండలం మెట్టుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత అంబటి జనార్దన్ రెడ్డి తండ్రి, మాజీ మునసబ్ చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలిసిన ఆ పార్టీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకుని జనార్దన్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో దేవారెడ్డి నాగూర్ రెడ్డి, చెన్నూరు శ్రీహరిరెడ్డి, వట్టూరు మునికిష్టయ్య పాల్గొన్నారు.

వాసవీక్లబ్, వనిత క్లబ్ నూతన కార్యవర్గం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట వాసవీ క్లబ్, వనిత క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. వాసవీక్లబ్ అధ్యక్షులుగా దరిసా గోపీకృష్ణ, కార్యదర్శిగా సేగు వెంకటశ్రీనివాసులు, కోశాధికారిగా కొత్తూరు శ్యామ్‌సుందర్ ఎన్నికయ్యారు. అలాగే వనిత క్లబ్ అధ్యక్షురాలిగా పాదర్తి జ్యోత్స్న, కార్యదర్శిగా సుగ్గాల సౌజన్య, కోశాధికారిగా మారజ్ఞాపిక ఎన్నికయ్యారు. క్లబ్ ప్రతినిధులు బండారు శబరీష్‌గుప్తా, సాయిరామ్, సునీత, రావూరి సుబ్రమణ్యం, నిర్మలాకుమారి, పద్మజ పాల్గొన్నారు.

యువకులపై కేసు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు శుక్రవారం బల్లి ఆశీష్, మనుబోలు కార్తీక్ మరికొంత మంది వెళ్లారు. వారు కార్యాలయంలో ఫొటోలు తీయడంతో సబ్ రిజిస్ట్రార్ పెంచలయ్య అడ్డుకున్నారు. వారు తాము విలేకరులమని దౌర్జన్యం చేశారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

దక్కిలి : దక్కిలిలో శుక్రవారం ఎస్‌ఐ శివశంకర్ తన సిబ్బందితో కలిసి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో వివిధ పనుల నిమిత్తం పోలీస్ స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చలివేంద్రం ఏర్పాటుచేశామన్నారు.

రూ.102 కోట్లతో వెంకటగిరి అభివృద్ధి

- 2025-26 వార్షిక బడ్జెట్‌కు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం
- స్థానిక సమస్యలపై కౌన్సిలర్ల ఆగ్రహం


కౌన్సిలర్ సమావేశం జరుగుతున్న దృశ్యం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మున్సిపాలిటీని రూ.102 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించి రూ.102 కోట్లతో రూపొందించిన 2025–26 వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ మాట్లాడుతూ బడ్జెట్‌లో సవరణలు ఉంటే కౌన్సిలర్లు అర్జీ రూపంలో ఏప్రిల్ 25వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. 4వ వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ, 16వ వార్డు కౌన్సిలర్ ధనియాల రాధ మాట్లాడుతూ తమ వార్డుల్లో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని ఆరోపించారు. కైవల్యానది సమీపంలో భూ కబ్జాలకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వరదలు వచ్చినప్పుడు నీరు పట్టణాన్ని ముంచెత్తుతుందని పేర్కొన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ కందాటి కళ్యాణి మాట్లాడుతూ ఆర్టీసీ డిపో నుంచి బిబి హెచ్‌టీ వరకు ఉన్న ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. 6వ వార్డు కౌన్సిలర్ మాడా జానాకిరామయ్య, 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాట్లాడుతూ అనధికారిక లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 21వ వార్డు కౌన్సిలర్ జి ఢిల్లీబాబు మాట్లాడుతూ పాత విజిటబుల్, మాంసం మార్కెట్ శిథిలావస్థకు చేరుకున్నాయని, మరమ్మతులు చేయాలని కోరారు. 22వ వార్డు ఆటంబాకం శ్రీనివాసులు మాట్లాడుతూ గత బడ్జెట్‌లో పోలేరమ్మ జాతరకు ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందని, ప్రస్తుతం రూ.60 లక్షలు కేటాయించడం తగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చెంచు కృష్ణయ్య



నాయుడుపేట టౌన్ : నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆశా చెంచుకృష్ణయ్య విజయం సాధించారు. కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. పలువురు న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చిట్టేటి నారాయణ, ప్రధాన కార్యదర్శిగా పోట్లాపూడి శ్రీనివాసులు, ట్రెజరర్‌గా ఏ పరశురామయ్య, కార్యవర్గ సభ్యులుగా బీ చిరంజీవి బాబు, కే నిత్య, కే సుబ్రహ్మణ్యం, ఎం సుధీర్, అమానుల్లా ఎన్నికయ్యారు. న్యాయవాదుల సంక్షేమం కోసం కలిసికట్టుగా పని చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది.

మహిళలకు ఉగాది పురస్కారాలు


మహిళలను సత్కరిస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : పలు రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురు మహిళలకు శుక్రవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జేజీ పాల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకురాలు అడపాల ప్రమీలాదేవి ఉగాది పురస్కారాలు అందజేశారు. వైద్య, విద్య రంగాల్లో సేవలు అందించిన 10 మంది మహిళలకు భారత మహిళా శిరోమణి అవార్డు ఇచ్చి ప్రత్యేక కిరీటాలతో సత్కరించారు. అదే విధంగా మహిళల పొదుపు ఖాతాల ఏర్పాటులో గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన మెప్మా అధికారులు, ఆర్పీలు 46 మందిని సత్కరించి చీరలు, ఉగాది పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సునీత, కుసుమ కుమారి, మీనా, విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు, నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల పరిశీలన


నెలబల్లిలో భూములను పరిశీలిస్తున్న జేసీ

దొరవారిసత్రం : మండలంలోని నెలబల్లి పరిధిలోని సర్వే నంబరు 7లోని ప్రభుత్వ భూమిని శుక్రవారం ఇంటి స్థలాల కోసం జేసీ శుభంబన్సల్ పరిశీలించారు. ఇంటి స్థలాల కావాలని గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఆయన ప్రభుత్వ భూమిని పరిశీలించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ శైలకుమారి, సిబ్బంది ఉన్నారు.

క్రైస్తవుల ర్యాలీ

గూడూరు రూరల్ : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా క్రైస్తవులు శుక్రవారం సాయంత్రం గూడూరులోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద సంతాప ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. నిందితులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో వూలా డానియేల్ రవికుమార్, పాస్టర్ అబ్రహాం, ప్రభుదాసు, శాంతి కుమార్, పాస్టర్ యోహాను, బ్రదర్ టి.జె.మార్క్, సుధీర్ జాషువా తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు



కలువాయి(సైదాపురం): కలువాయి బీవీఎన్‌ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులకు శుక్రవారం అలింకో అండ్ సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా మంజూరైన ఉపకరణాలను ఎంఈవో–2 శేషగిరిరావు, హెచ్‌ఎం ఎస్టి అబ్బాస్ అలి పంపిణీ చేశారు. సుబ్రమణ్యం శంశాక్‌కు బ్యాటరీ ట్రై సైకిల్, రిత్విన్‌కు హియరింగ్ కిట్ల అందజేశారు. సకాలంలో ఫిజియోథెరపి చేయించుకుని అంకవైకల్యాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చని వారు సూచించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి, ఐఈఆర్టీలు భానుప్రియ, విశ్వ, ఉపాధ్యాయులు పెంచల పుల్లయ్య, శైలజ పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

బాలాయపల్లి(సైదాపురం) : సమస్యల పరిష్కారం వచ్చే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వెంకటగిరి, బాలాయపల్లి, దక్కిలి మండలాల రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.